## మినీకథ ఇంటర్వ్యూ

విశాలమైన ఆ ఆవరణలో వచ్చి ఆగిందో నీలం రంగు స్కూటరు.

స్కూటర్‌ని పార్కింగ్‌లో పెట్టి, ఫైలుచేత పట్టుకొని లోనికి నడిచాడు ముప్ఫయి రెండేళ్ళ ప్రదీప్.

అధునాతనమైన ఆ భవనంలో అప్పటికే చాలామంది కూర్చుని ఉన్నారు. ప్రదీప్ కూడా వారి పక్కన కూర్చున్నాడు.

''ఇంకా ఇంటర్వ్యూలు మొదలవ్వలేదా?'' అడిగాడు పక్కనున్న ఆసామిని.

''లేదు'' చెప్పాడతడు.

''ఎన్ని గంటలకి మొదలవుతాయో తెలీదా?''

''హ! మన దేశంలో ఇంటర్వ్యూలు అన్న సమయానికి ఎప్పుడు జరిగాయి కనుక!'' అన్నాడతడు నవ్వుతూ!

''నిజమే లెండి'' నవ్వుతూ చెప్పాడు ప్రదీప్!

ఇంకా ఇంటర్వ్యూల కోసం చాలామంది వస్తున్నారు. ఒకరితో మరొకరి పరిచయాలు, జోకులు, రాజకీయాలపై చర్చలతో ఆ వాతావరణమంతా గోలగా వుంది.

దాదాపు రెండు గంటల తర్వాత ఇంటర్వ్యూలు మొదలయ్యాయి. వరుసగా ఒకొక్కరు లోనికి వెళ్ళి వస్తున్నారు. కొందరి ముఖాల్లో ఇంటర్వ్యూ బాగా జరిగిందని తృప్తి మరి కొందరి మొఖాల్లో జవాబులు బాగా చెప్పలేక పోయామన్న అసంతృప్తి తాండవిస్తోంది.

తన పేరు పిలవడంతో లోనికి వెళ్ళాడు ప్రదీప్.

''ప్లీజ్ మిస్టర్ ప్రదీప్! టేక్ యువర్ సీట్'' అన్నారు ఆఫీసర్లు ముగ్గురు.

''థాంక్యూ'' అంటూ కుర్చీలో కూర్చున్నాడు ప్రదీప్.

''మిస్టర్ ప్రదీప్! మీ ఆస్తి వివరాలు చెప్పండి'' చిరునవ్వుతో ప్రశ్నించాడో ఆఫీసర్.

''రెండు లక్షల రూపాయిలు విలువ చేసే ఇల్లు వుంది. అదికాక చాలా కంపెనీల్లో షేర్లు వున్నాయి. అదికాక నాకు ఉద్యోగం వుంది. వీటన్నిటి వల్ల నా నెలసరి ఆదాయం 5 వేల రూపాయిలు వుంటుంది'' అంటూ ముగించాడు ప్రదీప్.

''మిస్టర్ ప్రదీప్! మీరెంత వరకు చదువుకున్నారు.

''ఎం.కాం. పాసయ్యాను'' చెప్పాడు ప్రదీప్.

''ఓ.కె. మిస్టర్ ప్రదీప్, మీరు ఇంక వెళ్ళి రండి-మీకే విషయం తొందర్లోనే తెలియజేస్తాము''

''థాంక్యూ సర్స్-సీ యూ అగైన్'' అంటూ బయటికి వెళ్ళిపోయాడు ప్రదీప్.

వారం రోజుల తర్వాత ప్రదీప్ పేర్న ఓ రిజిస్టర్డ్ లెటర్ వచ్చింది.

మీ ఆస్తి వివరాలు, చదువు, ఫ్యామిలీ బేక్‌గ్రౌండ్ మొదలైన విషయాలు మాకు సంతృప్తి కలిగించినందు వల్ల మీ అబ్బాయికి మా కాన్వెంట్‌లో సీటు ఇవ్వడానికి నిశ్చయించాము. వారం రోజుల్లో మూడు వేల రూపాయిలు డొనేషన్ కట్టి మీ అబ్బాయిని మా కాన్వెంట్లో చేర్పించగలరు.

- ఇదీ ఆ ఉత్తరం సారాంశం.

ఉత్తరం చదివి 'హిపిప్ హుర్రే!' అంటూ కేకపెట్టి అయిదేళ్ళ వేణుని ముద్దు పెట్టుకొని గాల్లోకి గిరగిరా తిప్పాడు ప్రదీప్.

(కాన్వెంట్ స్కూల్లో సీట్లుదొరకక ఇబ్బంది పడుతున్నవారిపై వ్యంగ్య రచన ఇది. ఎవరినీ నొప్పించాలని కాదని మనవి.)

-ఎస్. వేణుగోపాల్ కుమార్




ఆంధ్రజ్యోతి

సచిత్ర వారపత్రిక



"మా మంచిమేస్టారు"

'తల్లిదండ్రుల తరవాత గురువే ప్రత్యక్ష దైవం' అని మనం నమ్ముతాం. ఈనాడు విద్యారంగం చూస్తే అస్తవ్యస్తంగా వుంది. నిజానికి పిల్లలకు అటు బడి పంతుళ్ళు, ఇటు తల్లిదండ్రులు భయపడి జీవిస్తున్న కాలమిది. విద్యార్థుల్ని నిజాయితీతో, ప్రేమతో ఆదర్శ మూర్తులుగా తీర్చిదిద్దిన గొప్ప ఉపాధ్యాయులున్న దేశం తెలుగుదేశం మనది. అల్లాగే 'గురుభక్తి-గురుపూజ' వర్ధిల్లిన ఉత్తమ సంస్కారం కూడా మనదే! వాచర్లు లేకుండా పరీక్షలు నిర్వహించి నూటికి నూరు శాతం ఫలితాల్ని సాధించిన ఉపాధ్యాయులున్న కాలం ఒకప్పుడు వుండంటే నమ్ముతారా? ఆ వైభవోజ్వల మహా కాలాన్ని తలపించి, మీ కళ్ళ ముందు నిలబెట్టే చిన్న నవల

మా మంచి మేస్టారు

త్వరలో ప్రారంభం!

మా మంచి మేస్టారు నవలలో ప్రకటించడానికి మీ స్కూలు ఫోటో, మీ మేస్టారి ఫోటో, పూర్తి పేరు, బోధించిన అంశాలు, కాలం వివరాల్తో పంపితే వారం వారం 'గురుపూజా కార్యక్రమం'గా ప్రకటిస్తాము.



ఉపాధ్యాయుల్ని గౌరవించే పత్రికగా ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 'మా మంచి మేస్టారి' ఫోటో (ల)ను ప్రకటిస్తుంది.



—ఎడిటర్